క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



పూజలందుకున్న దత్తాత్రేయస్వామి

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం ప్రాంగణంలోని దత్తాత్రేయస్వామి వారికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ చేశారు. అనంతరం దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ, నివేదన తదితర పూజలు నిర్వహించారు.

అలరించిన భక్తి సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం టి. నారాయణ భజన బృందం, కర్నూలు వారిచే భజన సంకీర్తనలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద భజన కార్యక్రమం జరిగింది. జయగణనాయక, శివ శివశంకరా, నమశ్శివాయ, భజే మహేశం, జ్యోతిర్లింగస్వరూప, శివస్తుతి, నమో భూత నాథా, శివనామమే నా గానము, శ్రీశైలంలో వెలసిన మల్లన్న, ఎవరికీ ఎవరయ్యా ఈశ్వరా, తదితర గీతాలకు జి. గోపాల్, శ్రీలక్ష్మి సులోచన, ఛాయాదేవి, నాగమణి, సత్యవతి, ఈశ్వరయ్యాచారి ఆలపించారు.

సర్పంచ్ లేకుండానే 'పల్లె పండుగ'

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో గురువారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమం గ్రామ సర్పంచ్ రాజేశ్వరి లేకుండానే మమ అనిపించారు. గ్రామ సర్పంచ్ ప్రథమ పౌరురాలు అయినప్పటికీ పల్లె పండగ ఉత్సవానికి ఆమె ప్రాతినిధ్యం లేకుండా అధికార పార్టీకి చెందిన నాయకులు కార్యక్రమం చేపట్టడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం పరిపాటిగా మారిపోయిందని ఎంపీ వర్గీయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పురుష ఉపాధ్యాయులను బదిలీ చేయాలి

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ చెంచు గూడెంలోని బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో పనిచేసే పురుష ఉపాధ్యాయులను వెంటనే బదిలీ చేయాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్‌నాయక్ అధికారులను కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బైర్లూటీ చెంచుగూడెంలోని బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో నలుగురు పురుష ఉపాధ్యాయులు పని చేస్తున్నారని తెలిపారు. వారి వల్ల బాలికలు, మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారిని బదిలీ చేసి వారి స్థానంలో మహిళా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

ఆత్మకూరురూరల్: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌డీపీఓ రామాజి నాయక్ అన్నారు. ఇలాంటి మోసాలపై గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో పోర్న్ సైట్స్ చూస్తున్నారని.. కేసులు పెడతామని పోలీసుల పేరుతో బెదిరించి సైబర్ మోసగాళ్లు నగదు వసూలు చేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పోలీస్ లోగోలతో పాప్ అప్‌లు సృష్టించి రెండూ కలిపి సోషల్ మీడియా, మెయిల్స్ ద్వారా లింక్ పంపి ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వారిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ తరహా మోసాలకు గురైనప్పుడు ప్రజలు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు.

వేతనాలు చెల్లించకపోవడం దారుణం

ఆత్మకూరు: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీ ఉపాధ్యాయులకు ఐదు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని గిరిజన ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు జవహర్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రతి చెంచుగూడెంలో ఆశ్రమ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు. అయితే అధికారులు ఉపాధ్యాయులను నియమించకపోవడంతో నంద్యాల జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ ఉపాధ్యాయులు 62 మంది పని చేస్తున్నారని, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ ఉపాధ్యాయులకు ఐదు నెలలుగా వేతనాలు ముట్టలేదని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతనాలు చెల్లించని పక్షంలో నంద్యాల డీటీడబ్ల్యూఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



నందికొట్కూరు: పొగాకు చేనులో చేరిన వర్షపు నీరు



కంది చేనులో నిలిచిన నీరు

భారీ వర్షం... తీవ్ర నష్టం!

- నీటమునిగిన పంటలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి చేరిన వర్షపునీరు... తడిసిపోయిన సామగ్రి
- అధికారులు, పాలకుల తీరుపై మండిపడుతున్న శివారుకాలనీ ప్రజలు



జలమయమైన కాలనీ



నిండుగా ప్రవహిస్తున్న బవనాశి నది

నందికొట్కూరు: తుపాన్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటపొలాలు నీట మునిగాయి. చేతికొచ్చిన దిగుబడులు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున నందికొట్కూరులో కురిసిన భారీ వర్షం తీవ్ర నష్టం చేకూర్చింది. ఏకంగా 75. 8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా మిడుతూరు మండలం, వీపనగండ్ల గ్రామాల్లోనూ 38. 6 మిల్లీ మీటర్ల మేర భారీ వర్షం కురవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. నందికొట్కూరు సమీపాన మిద్తూరు మండలం, వీపనగండ్ల పొలిమేరలో భారీ వర్షం కురిసింది. దీంతో నందికొట్కూరు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మారుతీ నగర్, హాజీ నగర్, బైరెడ్డి నగర్ నీట మునిగాయి. తెల్లవారుజామును పెద్దఎత్తున నీరు రావడంతో ఆయా కాలనీల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏమి జరుగుతుందో అర్థమవ్వని పరిస్థితి నెలకొంది. బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇళ్లలోకి నీరు చేరడంతో నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి.

పంట పొలాల్లోకి వరద నీరు

పంట పొలాల్లోకి నీరు చేరడంతో పత్తి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా నష్టం వాటిల్లింది. అధికారులు పంట పొలాలను కన్నెత్తి కూడా చూడడంలేదని బాధిత రైతులు ఉపేంద్రారెడ్డి, గోవిందరెడ్డి మండిపడ్డారు. నందికొట్కూరు మండలంలో 100 మంది రైతుల పంటలు నీట మునిగాయి. పత్తి–150 హెక్టార్లు, మొక్కజొన్న–1030 హెక్టార్లు, మినుములు–19 హెక్టార్లు, మిరప- 24 హెక్టార్లు, కంది- 44 హెక్టార్లు, ఉల్లిగడ్డ–56 హెక్టార్లు చొప్పున్న పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులపై మండిపడుతున్న లోతట్టు కాలనీవాసులు

వీపనగండ్ల గ్రామంలో కురిసిన భారీ వర్షానికి నందికొట్కూరు పట్టణ లోతట్టు ప్రాంతాలు మారుతీ నగర్, హాజీ నగర్, బైరెడ్డి నగర్ జలమయం అయ్యాయి. తెల్లవారుజామున ఒక్కసారిగా నీరు ఇళ్లలోకి రావడంతో భయాందోళన గురైన కాలనీల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడుతున్నారు. అప్రమత్తంగా ఉండాలంటూ సూచనలు చేసిన అధికారులు తమను పట్టించుకోవడం లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేమున్నాం అంటూ హామీలు గుప్పించే ఎమ్మెల్యే జయసూర్య, ఎంపీ బైరెడ్డి శబరి, మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఎక్కడున్నారంటూ నిలదీస్తున్నారు ఆయా కాలనీల ప్రజలు. నీట మునిగి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోవడం లేదని వాపోయారు. కాలనీల ప్రజలు ఇళ్లలోకి నీరు చేరుతున్నాయని లబోదిబో అంటూ ఫోన్లు చేస్తే వరద నీరు తగ్గే సమయంలో కమిషనర్ బేబి, వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు అలా వచ్చి ఇలా వెళ్లారంటూ కాలనీల వాసులు మండిపడ్డారు.

పాములపాడులో 48.8మిమీ...

పాములపాడు: మండలంలో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షం 48.8మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఈ వర్షం వలన మండలంలో మొక్కజొన్న, మినుము పంటలు దాదాపు 412 హెక్టార్లలో దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

పగిడ్యాలలో 40.6 మి.మీ

పగిడ్యాల: తుపాన్ ప్రభావంతో మండలంలో 40.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. తెల్లవారుజామున అకాల వర్షానికి మొక్కజొన్న, పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

కొత్తపల్లిలో 29.4 మి.మీ

కొత్తపల్లి: మండలంలో 29.4 మి.మీల వర్షపాతం నమోదు అయింది. గువ్వలకుంట్ల, వీరాపురం, లింగాపురం, గోకవరం, కొక్కెరంచ, నాగంపల్లి, జడ్డువారి పల్లె, దుద్యాల, నందికుంట, శివపురం, సింగరాజుపల్లె, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాలలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు జోరుగా వాన కురిసింది. దీంతో మినుము, పొగాకు, ఇతర పంటపొలాల్లో వర్షపునీరు నిలిచింది.

మిడుతూరులో 38.6 మిమీ

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు పీరుసాహెబ్‌పేట, కడుమూరు, పైపాలెం, నాగలూటి, చెరుకుచెర్ల, వీపనగండ్ల, బైరాపురం, చింతలపల్లి తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి తెల్లవారుజామువరకు వర్షం కురిసింది. మండలంలో 38.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ముంచిన వాన

- పొంగిన బవనాశి, సుద్దవాగు, గుండ్లకమ్మ వాగులు
- నీట మునిగిన పంటలు



భారీ వర్షాలకు మునిగిన మినుము పంట

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా గురువారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. 27 మి.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం 16.4 మి.మీ, మంగళవారం 6.2 మి.మీ. వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మినుము పంట పూర్తిగా దెబ్బతినే పరిస్థితి నెలకొంది. అలాగే వరి పంట నేలకొరిగింది. రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న దిగుబడులు పూర్తిగా తడిచిపోయాయి. ఇటీవల ఆత్మకూరు డివిజన్‌లో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం తుపాన్ వల్ల మినుము, వరి పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహానందిలో కుండపోత వర్షం

మహానంది: అల్పపీడన ప్రభావం కొనసాగుతోంది. మహానంది మండలంలో గురువారం ఉదయం కొద్దిసేపు ఎండ పెట్టినా మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అవస్థలు పడ్డారు. మహానందితో పాటు గ్రామాల్లోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే పలు పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన చెందుతున్నారు.



మహానందిలో కురుస్తున్న వర్షం



గొడుగులతో బడికెళ్తున్న విద్యార్థులు

కాలనీలు జలమయమైనా పట్టించుకోరా?



ముంపు ప్రాంతాల్లో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

నందికొట్కూరు: కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరిన మున్సిపల్, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని వామపక్షాల నాయకులు రఘురామమూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు విమర్శించారు. గురువారం పట్టణంలోని ముంపుకు గురైన ప్రాంతాల్లో ప్రజలతో కలిసి బాధితులను ఆదుకోవాలంటూ వామపక్షాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరి నిత్యవసర వస్తువులు తడిసిపోవడం జరిగిందన్నారు. ఇళ్లలోకి నీరు చేరినా కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు గోపాలకృష్ణ, బాబు, నాగార్జున, రమేష్, స్వాములు, శేఖర్‌నాయుడు, నాసిర్, ఖాజా, హుసేన్, మధు, సుధాకర్, మాబాషా, కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ





రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా, వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో రూ.3.20 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. పాలిటెక్నిక్ కళాశాల, కాకులసెంటర్, బండ్లబజార్, వైజాగ్ కాలనీల్లో నాలుగు రోడ్లకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కె.వెంకట శివప్రసాద్, ఎంపీడీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ అధికారులు ధనిబాబు, ఆజాద్, సుబ్బయ్య పాల్గొన్నారు.

వేల్పనూరులో..

వెలుగోడు: వేల్పనూరులో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ సర్దార్ మియా సీసీరోడ్లకు భూమి పూజ చేశారు. గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సుంకన్న, ఏపీఓ మల్లికార్జున పాల్గొన్నారు.

నట్టల నివారణకు మందులు

పాములపాడు: గొర్రెల్లో వ్యాపించే నట్టల వ్యాధి నివారణకు గురువారం పశువైద్యాధికారులు పాములపాడు అనిల్, వేంపెంట భాస్కర్ మందులు వేశారు. మండలంలోని జూటూరు, పాములపాడు, వేంపెంట గ్రామాల్లో 2050జీవాలకు ఫెన్బెండజోల్, ఐరన్ మందులు వేశారు.

రక్తహీనత నివారణకు మునగాకు ఔషధం



మునగాకు ప్రయోజనాలను వివరిస్తున్న నాగేశ్వరమ్మ

కొత్తపల్లి: పిల్లలు, మహిళలు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనతను దూరం చేయడంలో మునగాకు ఔషధంలా పనిచేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. గురువారం మండలంలోని సింగరాజు పల్లె అంగన్వాడీ కేంద్రంలో మునగాకు ప్రయోజనాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు మహిళలు చేసే వంటలలో మునగాకు ఉండే విధముగా చూసుకోవాలన్నారు. మునగాకులో పుష్కలంగా ఐరన్, కాల్షియం ఉంటాయని దీనివల్ల రక్తహీనత రాకుండా నివారించుకోవచ్చునన్నారు.

ఉపాధి పనులు గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: వ్యవసాయ కూలీలకు రెండు సంవత్సరాలకు సరిపడ ఉపాధి పనులు గుర్తించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ హరికృష్ణ ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మేరి మాట్లాడుతూ ఏడాదికి 100 రోజుల ప్రకారం రెండేళ్ల వరకు ఉపాధి కూలీలకు పనులు కల్పించేందుకు ముందే పనుల గుర్తింపు చేపట్టాలన్నారు. జాబుకార్డు కలిగిన ప్రతి కుటుంబానికి అడిగిన వెంటనే పనులు కల్పించాలన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శం





మహానంది: కళాశాల విద్యార్థులతో అసోసియేట్ డీన్ జయలక్ష్మి, ఆత్మకూరు: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మారూఫ్ ఆసియా

మహానంది: కృషి ఉంటే మనుషులు ఋషులవుతారనేదానికి వాల్మీకి మహర్షి నిదర్శనమని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి అన్నారు. కళాశాలలో గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే మహానందిలో వాల్మీకి సంఘం నాయకులు పటాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, రంగస్వామి పాల్గొన్నారు.

వెలుగోడు: మానవాళి జీవితంతో ముడిపడి ఉన్న రామాయణ గ్రంథాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్ సూచించారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పించారు. గురువు, దైవం, తల్లిదండ్రుల ఔనత్యాన్ని మానవాళికి చక్కగా తెలియపరిచిన మహనీయుడు వాల్మీకి మహర్షి అన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని వెంగళరెడ్డినగర్‌లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మారూఫ్ ఆసియా, కమిషనర్ రమేష్‌బాబు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ హరిప్రసాద్, వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు పీరుసాహెబ్ పేట, సుంకేసుల, కడుమూరు, 49- బన్నూరు, తలముడిపి, చెరుకుచెర్ల తదితర గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పీరుసాహెబ్ పేట గ్రామంలో వాల్మీకి సోదరులు వాల్మీకి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాల మధ్య యువత కోలాహలం మధ్య ఊరేగింపు వైభవంగా సాగింది.

పగిడ్యాల: మండల కేంద్రం పగిడ్యాలతోపాటు నెహ్రూనగర్ , పాత, కొత్త ముచ్చుమర్రి, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట తదితర గ్రామాల్లో గురువారం వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. వాల్మీకి చిత్రపటాన్ని పురవీధుల గుండా ఊరేగించి భక్తి భావాన్ని చాటుకున్నారు.

జూపాడుబంగ్లా: వాల్మీకి మహర్షి ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయుడని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. గురువారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రం కొత్తపల్లితోపాటు గ్రామాల్లో గురువారం వాల్మీక మహర్ష జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు అధికారులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాల్మీకి బోయ సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల భారీగా తగ్గింపు

జూపాడుబంగ్లా: రిజర్వాయర్లు నిండడంతో పాటు కురుస్తున్న వర్షాల వల్ల పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి భారీగా నీటివిడుదలను తగ్గించినట్లు అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో శ్రీశైలం జలాశయంలో 884.50అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 883.50అడుగులు నమోదైనట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోతిరెడ్డిపాడు నుంచి 8వేల క్యూసెక్కులకు నీటి విడుదలను తగ్గించినట్లు తెలిపారు. ఎస్సార్‌బీసీ, తెలుగుగంగ కాల్వల కిందున్న రిజర్వాయర్లు గరిష్టస్థాయి నీటిమట్టంతో ఉండటంతో నీటి విడుదల తగ్గించినట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగు గంగ కాల్వకు 6వేల క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్, కేసీ ఎస్కేప్ కాల్వకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. జ

ప్రజా సమస్యలపై గళం విప్పుదాం

కొత్తపల్లి: ప్రజా సమస్యలపై గళం విప్పుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి. యేసురత్నం పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సింగరాజు పల్లి గ్రామంలో సీపీఎం శాఖ కమిటీ ఎన్నిక నిర్వహించారు. పార్టీ గ్రామ కార్యదర్శిగా నక్క దాసు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికుల పక్షాన పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ తిరుపాలు

నందికొట్కూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా తప్పదని బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరులో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. . 18 కేసులు నమోదు చేసి రూ. 7,430 జరిమానా విధించామని ఎస్ఐ తెలిపారు.

నివాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటును అడ్డుకుంటాం

నందికొట్కూరు: ప్రజలు నివసించే ప్రాంతాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని ప్రజాసంఘాల నాయకులు ఫక్కీర్‌సాహెబ్, వెంకటేశ్వర్లు, మజీద్‌మియ్యా హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పగిడ్యాల రోడ్డులోని సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద మద్యం దుకాణం వద్దంటూ ప్రజా సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు.

క్రీడలతో మానసికోల్లాసం

నందికొట్కూరు: క్రీడలతో శారీరక ధృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి అన్నారు. గురువారం గవర్నమెంట్ హైస్కూల్ మైదానంలో స్కూల్ గేమ్స్‌లో బాలుర విభాగంలో అండర్-14, అండర్-17 పోటీలు నిర్వహించారు. సెప్టెంబరు 30వ తేదీన నియోజకవర్గ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. క్రీడాకారులను హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు అభినందించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం మండల పరిధిలోని అల్లూరు, కొణిదేల గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. సర్పంచు నవీన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.